

భూ సేకరణలో జాప్యం వద్దు

కలెక్టర్ టిఎస్.చేతన్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో వివిధ ప్రాంతాల్లో చేపట్టిన భూసేకరణ పనుల్లో ఎలాంటి జాప్యం చేయకుండా అన్ని పనులను సత్వరమే పూర్తి చేయాలని కలెక్టర్ టి.ఎస్.చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో ఎన్‌హెచ్ 342, ఎన్‌హెచ్ 716 జి, జాతీయ రహదారులకు సంబంధించిన భూ సేకరణ పనుల పురోగతిపై జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌తో కలిసి సంబంధిత శాఖాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ కేటాయింపు ప్రతిపాదనలపైన వెంటనే క్షేత్రస్థాయి పరిశీలన చేసి నిబంధనల మేరకు నివేదికలను సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహశీల్దార్లు కలెక్టర్ కార్యాలయనికి అందజేయాలని ఆదేశించారు. ప్యాకేజీ 2 కింద పెడబల్లి, కప్పలబండ భూసేకరణకు సంబంధించి పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. ఏమైనా సమస్యలుంటే భారత జాతీయ రహదారుల అథారిటీ సంబంధిత తహశీల్దార్లతో రెవెన్యూ డివిజన్ అధికారులతో సమన్వయ సహకారం చేసుకుంటూ వాటిని వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కదిరి బైపాస్ రోడ్డు పనులు త్వరితగతినపూర్తి చేయాలని ఆదేశించారు. కూటగుళ్ల ఆర్ఒ బి, 716-జిబి గోరంట్ల- కొత్తపల్లి, గోరంట్ల- హిందూపురం ప్యాకేజీ నెంబర్ 42 పనులపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్ఎఐ పీడీ బి.అశోక్ కుమార్, కె.మల్లికార్జునరావు, బి.నాగరాజు, ఎల్.సుజాత, గిడ్డయ్య, చిలమత్తూరు డిటి జగన్నాథతో పాటు వివిధ మండలాల తహశీల్దార్లు పాల్గొన్నారు.

అనంతలో జోరు వాన..!

- నగరంలో రోడ్లన్నీ జలమయం
- నిలిచిన విద్యుత్ సరఫరా
- పిడుగుపాటుతో మహిళ మృతి



అనంతలో కురుస్తున్న వర్షం

అనంతపురం శ్రీకంఠం సర్కిల్లో జలమయం అయిన రహదారి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లాలో గురువారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ఉరుములు, మెరుపులతో కూడిన జోరు వాన పడింది. అనంతపురం నగరంలో ఎడతెరిపి లేని వర్షం పడింది. వర్షంతో ప్రధాన కూడళ్లన్నీ జలమయం అయ్యాయి. నగరంలోని సప్తగిరి సర్కిల్ , శ్రీకంఠం సర్కిల్‌తోపాటు, బస్టాండు ఆవరణం మొత్తం నీటితో నిండిపోయాయి. ఈ సమయంలో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. శింగనమల, బుక్కరాయసముద్రం, పామిడి, పెద్దపప్పూరు తదితర మండల ప్రాంతాల్లోనూ వానపడింది. మండు వేసవిలో ఎండతో సతమతం అవుతున్న ప్రజలకు ఈ వర్షం కాస్త ఉపశమనాన్ని ఇచ్చింది. చల్లని వాన జల్లులు పడటంతో వేసవి తాపం నుంచి కొంత ఉపసమనం లభించినట్టయింది. గత కొన్ని రోజులుగా జిల్లాలో వేసవి తాపం పెరిగిన విషయం తెలిసిందే. 41 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమదవుతూ వచ్చాయి. ఇటువంటి తరుణంలో వానలు పడటంతో ప్రజలకు సంతోషాన్ని ఇచ్చింది. మరో మూడు రోజులపాటు వానలు పడే అవకాశముందని వాతావరణ శాఖ సూచిస్తున్నట్టు కలెక్టర్ వినోద్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తేలిక పాటి వర్షాలతోపాటు పిడుగులు పడే అవకాశం ఉందని చెప్పారు. ప్రజలు బయటకు వెల్లే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు .

కూలిన భవనం సైడ్‌వాల్

గురువారం కురిసిన వర్షంకు నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డులో నూతనంగా ప్రారంభించిన ఒక కార్పొరేట్ బట్టల దుకాణం సైడ్‌వాల్ కూలింది. నిర్మాణం పూర్తవకనే దీని ప్రారంభం జరిగింది. ఇప్పుడు ఈ భవనం మూడవ అంతస్తు నుంచి సైడ్ విరిగి రోడ్డుపై పడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ వెళ్లకపోవడంతో ముప్పు తప్పింది.

అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

మరో మూడు రోజులు పిడుగులతో కూడిన వానలు పడే అవకాముచ్చందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అనంత కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ సూచించారు ఈ మేరకు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



వర్షం, గాలులకు కూలిన అనంతపురం నగరం కళ్యాణదుర్గం రోడ్డులోని ఓ కార్పొరేట్ బట్టల దుకాణం ప్రహరీ

పిడుగుపాటుకు మహిళ మృతి



మృతి చెందిన మహిళ ఇంద్రజ(ఫైల్ ఫోటో)

గుంతకల్లు రూరల్ : అనంతపురం జిల్లా గుంతకల్లు మండలం కదిరిపల్లిలో గురువారం సాయంత్రం పిడుగుపడి ఓ మహిళ మృతి చెందింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. కదిరిపల్లి గ్రామానికి చెందిన ఇంద్రజ(25) తన భర్త వెంకటరమణతో కలిసి పొలం పనులకు వెళ్లి తిరిగి వస్తుండగా పిడుగు పడింది. ఈ ప్రమాదంలో ఇంద్రజ మరణించగా ఆమె భర్త తృటిలో ప్రాణాలతో బయట పడ్డాడు. మృతురాలికి ఒకటిన్నర సంవత్సరం కూతురు ఉంది.

నార్పలలో మూడు పాడి ఆవులు...

నార్పల : మండల కేంద్రం గవ్వల వీధికి చెందిన పాడి రైతు సుదర్శన్ మురళికి చెందిన మూడు పాలిచ్చే ఆవులు గురువారం సాయంత్రం పిడుగు పడి మరణించాయి. ఉరుములతో కూడిన వర్షం వస్తున్న సమయంలో పిడుగు పడి తన ఇంటి వద్ద ఉన్న మూడు ఆవులు చనిపోయాయి.

గవర్నర్‌ను కలిసిన జెఎన్‌టియు విసి

14వ స్నాతకోత్సవానికి ఆహ్వానం

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు వైస్‌ఛాన్సలర్ హెచ్.సుదర్శన రావు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ జస్టిస్ యస్.అబ్దుల్ నజీర్‌ను గురువారం సాయంత్రం రాజ్‌భవన్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. జెఎన్‌టియు 14వ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా రావాలని గవర్నర్‌ను ఆహ్వానించారు. ఈ సందర్భంగా గవర్నర్ యూనివర్సిటీ అభివృద్ధిపై విసితో మాట్లాడారు. జెఎన్‌టియును గ్రీన్ యూనివర్శిటిగా తీర్చిదిద్దాలన్నారు. పూర్వ విద్యార్థుల సహాయ సహకారాలు తీసుకుని యూనివర్శిటీ మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు. యూనవర్సిటీలో చేపట్టిన అభివృద్ధి పనుల గురించి విసి గవర్నర్‌కు తెలియజేశారు.



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు పుష్పగుచ్చం అందజేస్తున్న జెఎన్‌టియు విసిహెచ్.సుదర్శన రావు

డాక్టర్ల వైఖరికి నిరసనగా ఆందోళన

మృతుని కుటుంబసభ్యులు, గ్రామస్తుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న మృతుని బంధువులు, గ్రామస్తులు

ప్రజాశక్తి-హిందూపురం

ఇసుక దిబ్బపడి మతి చెందిన యువకుడి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించాలని గురువారం రాత్రి మృతుని కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వాసుపత్రి ప్రధాన గేటు ముందు నిరసన వ్యక్తం చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించకుండా వైద్యులు నిర్లక్ష్యం చేస్తున్నారని గేటు వద్ద ప్రధాన రహదారిపై బైటాయించి నిరసన తెలిపారు. పరిగి మండలం పెద్దిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన హేమంత్ కుమార్ అనే యువకుడు గురువారం పెన్నా నదిలో ఇసుక దిబ్బపడి మృతి చెందాడు. ప్రమాదం జరిగిన వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే చికిత్స అనంతరం కొంతసేపటికే మృతి చెందాడు. హేమంత్ కుమార్ మతి చెందడంతో మృతదేహాన్నిపోస్టుమార్టం గదికి తరలించారు. అయితే సాయంత్రం 6 గంటలైనా పోస్టుమార్టం నిర్వహించకుండా ప్రభుత్వ డాక్టర్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని పెద్దిరెడ్డి పల్లి గ్రామస్తులు ఆరోపించారు. దీంతోపాటు ఆసుపత్రి ముందు ప్రధాన రహదారిలో బైఠాయించి గంటపాటు నిరసన వ్యక్తం చేశారు. దాదాపు గంటపాటు ఆందోళన వ్యక్తం చేయడంతో రాకపోకలుకు అంతరాయం కలిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులను చెదరగొట్టడానికి ప్రయత్నించగా ఆందోళనకారులు తిరగబడి పోలీసులతో వాగ్వాదానికి దిగారు. వన్ టౌన్ సిఐ రాజగోపాల్ నాయుడు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారులతో చర్చించి నిరసన కార్యక్రమం విరమింప చేశారు.

ఫ్యాక్షన్‌ను ప్రేరేపిస్తున్న తోపుదుర్తి సోదరులు

- టీవీ బాంబు కాదు.. కారు బాంబు గురించి మాట్లాడండి..!
- వైసిపి పాలనలో నష్టపోయిన వారందరినీ జగన్మోహన్‌రెడ్డి పరామర్శించాలి
- రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత



విలేకరులతో మాట్లాడుతున్న పరిటాల సునీత

ప్రజాశక్తి-అనంతపురం

రాప్తాడు నియోజకవర్గంలో కక్షలు సమసిపోయి ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో మళ్లీ ఫ్యాక్షన్‌ను ప్రేరేపించేలా మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సోదరులు వ్యవహరిస్తున్నారని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత విమర్శించారు. గురువారం అనంతపురంలోని ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సునీత మాట్లాడారు. తోపుదుర్తి సోదరులకు ప్రతిదానినీ రాజకీయం చేయడం అలవాటుగా మారిందన్నారు. టీవీ బాంబు గురుంచి మాట్లాడుతున్న వారికి కారు బాంబు గుర్తుకు రాలేదాని ప్రశ్నించారు. గతంలో జరిగిన ఫ్యాక్షన్ కక్షలతో పరిటాల, కనముక్కల, గంగుల కుటుంబాలు చాలా నష్టపోయాయని చెప్పారు. ప్రస్తుతం అన్నీ మర్చిపోయి ప్రశాంతంగా ఉన్న సమయంలో తోపుదుర్తి సోదరులు మళ్లీ ఫ్యాక్షన్‌కు ఆజ్యం పోస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ స్వార్థం కోసం తోపుదుర్తి సోదరుల ఉచ్చులో పడొద్దని గంగుల, కనుముక్కల కుటుంబాలకు హితవు పలికారు. అధికారంలో లేనప్పుడు మాత్రమే కనుముక్కల, గంగుల కుటుంబాలు తోపుదుర్తి సోదరులకు గుర్తుకు వస్తాయన్నారు. పాపంపేట 106 సర్వే నెంబర్‌లో 63 సెంట్లలో నిర్మాణాలను సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తొలగించారన్నారు. ఈ ఇళ్ల కూల్చివేతను తాము అడ్డుకునే ప్రయత్నం చేశామన్నారను. ఇప్పుడు దీనిపై రాజకీయం చేస్తున్న తోపుదుర్తి సోదరులు ఇళ్లు కూల్చివేస్తుంటే ఎక్కడికి వెళ్లారని ప్రశ్నించారు. తమ అధినాయుడు ఆదేశాల మేరకు రామగిరి ఎంపీపీ అధ్యక్ష ఎన్నికకు తాము దూరంగా ఉన్నామని చెప్పారు. వైసిపి ఎంపిటిసిలను వారే కిడ్నాప్ చేసి తమపై నిందలు వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

వైసిపి హాయంలో బాధితులనూ జగన్ పరామర్శించాలి

వైసిపి పాలనలో రాప్తాడు నియోజకవర్గంలో దాడులకు గురైన వారందరినీ జగన్మోహన్‌రెడ్డి పరామర్శించాలని పరిటాల సునీత కోరారు. పాపిరెడ్డిపల్లిలో లింగమయ్య మతి ఘటన దురదృష్టకరం అన్నారు. ఈ ఘటన జరిగిన వెంటనే తమ పార్టీ మంత్రి, ఎంపీని బాధిత కుటుంబం వద్దకు పంపామని చెప్పారు. ఘటన జరిగి ఇన్ని రోజులు అవుతున్నా తోపుదుర్తి సోదరులు లింగమయ్య కుటుంబాన్ని ఎందుకు పరామర్శించలేదన్నారు. రాజకీయ కక్షలు పురిగొల్పేందుకే జగన్ జిల్లా పర్యటనకు వస్తున్నారన్నారు. తన భర్త పరిటాల రవి హత్యలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాత్ర ఉందన్నారు. సిబిఐ సైతం జగన్‌ను విచారించిందన్నారు.

ఉద్యోగ విరమణ సహజం

ప్రజాశక్తి -పుట్టపర్తి రూరల్

ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమని ఎస్పీ రత్న పేర్కొన్నారు. జిల్లాలో పనిచేస్తున్న, కదిరి అప్ గ్రేడ్ ఎస్ఐ రమణారెడ్డి, హిందూపురం ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ జైపాల్ ఉద్యోగ విరమణ సందర్భంగా బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయం లోని కాన్ఫరెన్స్ హాల్‌లో వారికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో వారు అందించిన సేవలను కొనియాడారు. 34 సంవత్సరాల పాటు వీరు పోలీసు శాఖలో అంకితభావంతో పని చేశారని జిల్లా ఎస్పీ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ తో పాటు, ఎఆర్ డిఎస్‌పి శ్రీనివాసులు, ఏవో సుజాత, సూపరింటెండెంట్ సరస్వతి, ఎస్‌బి సిఐ బాలసుబ్రమణ్యంరెడ్డి, అర్ఐ మహేష్, ఎస్‌బిఎస్ఐ ప్రదీప్ కుమార్, ఆర్ఎస్ఐలు వీరన్న, వెంకటేశ్వర్లు , ప్రసాద్, ఏఆర్ సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



రిటైర్డ్ ఉద్యోగులను సన్మానిస్తున్న ఎస్పీ

బార్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం బార్ అసోసియేషన్ నూతన కమిటీని సీనియర్, జూనియర్ న్యాయవాదులు గురువారం ఎన్నుకున్నారు. ధర్మవరం కోర్టులోనున్న బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన కమిటీని ఎంపిక చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎంఎ ఖరీమ్, ప్రధాన కార్యదర్శిగా డీఎల్ఎన్ మూర్తి, ఉపాధ్యక్షుడుగా నూర్ మహమ్మద్, సహాయ కార్యదర్శిగా బాలసుందరి, కోశాధికారిగా అబ్దుల్ సాబ్, కమిటీ సభ్యులుగా కెఎం రేష్మ, శివకుమార్, మోహన్ ప్రసాద్, నరసింహమూర్తి, పెద్దన్న, బాబా ఫకద్దీన్, ప్రసాద్, మణికంఠలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులకు సీనియర్, జూనియర్ న్యాయవాదులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఖరీమ్ మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రధాన కార్యదర్శి డీఎల్ఎన్ మూర్తి మాట్లాడుతూ ఏడాదిపాటు న్యూస్ పేపర్, తాగునీటి వసతిని బార్ అసోసియేషన్ కి ఉచితంగా తన సొంత ఖర్చులతో ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.



నూతన కమిటీ సభ్యులు

విద్యతో ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి-హిందూపురం

విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు వుంటుందని మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని టిటిడి కళ్యాణ మంటపంలో భాష్యం పాఠశాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల ఛైర్మన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరైన మున్సిపల్ ఛైర్మన్ మాట్లాడారు. నైతిక విలువలతో కూడిన విద్య విద్యార్థుల భవిష్యత్తును బంగారు మయం చేస్తుందన్నారు. అనంతరం ఆటల పోటీలలో విజయం సాధించిన విద్యార్థులకు మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సతీష్ కుమార్, పాఠశాల వైస్ ఛైర్మన్ హనుమంత రావు, సిఇఒ అనిల్ కుమార్, జెడ్ఇఒ రవి వర్మ, ప్రిన్సిపల్ అశోక్ కుమార్, హెచ్‌ఎం సల్మా భాను, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లితండ్రులు పాల్గొన్నారు.



చిన్నారికి బహుమతిని అందజేస్తున్న మున్సిపల్ ఛైర్మన్, తదితరులు

పర్యావరణ పరిరక్షణకు కృషి

ప్రజాశక్తి-హిందూపురం

పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు కలసికట్టుగా కృషి చేద్దామని జనవిజ్ఞాన వేదిక హిందూపురం జోన్ కమిటీ సభ్యులు గంగాధర్ సూచించారు. గురువారం హిందూపురం రూరల్ మండల పరిధిలోని తూముకుంట చెక్ పోస్ట్ పాఠశాలలో పర్యావరణం, అడవుల అభివృద్ధిపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విరివిగా మొక్కలను నాటడం వల్ల సకాలంలో వర్షాలు కురుస్తాయన్నారు. మొక్కలు నాటడంతోపాటు వాటిని సంరక్షించడం కూడా బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. అదే విధంగా ఇష్టారాజ్యంగా అడవులను నరికి వేయడం వల్ల వన్యప్రాణులు జనసంచారంలోకి వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తూముకుంట ప్రాంతం పారిశ్రామిక వాడలో ఉండడంతో తప్పనిసరిగా కాలుష్య నివారణకు పెద్ద ఎత్తున మొక్కలను నాటి వాటిని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి



ఇందిరమ్మ సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

మత స్వేచ్ఛను హరించడానికే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లు తెచ్చి మైనార్టీలను అణచి వేసే కుట్ర చేస్తోందని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. వక్ఫ్ సవరణ చట్టం 2025 బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలన్న డిమాండ్‌తో కాంగ్రెస్ నాయకులు గురువారం నల్ల రిబ్బన్లు కట్టుకొని పట్టణంలో ర్యాలీ నిర్వహించి ఇందిరమ్మ సర్కిల్ లో నిరసన తెలిపారు. తహశీల్దార్ కార్యలయం ముందు నిరసన తెలిపి తహశీల్దార్ వెంకటేశుకు వినతిని అందించారు. కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షులు సుధాకర్, పి సి సి మెంబర్ శ్యాంకిరణ్, హనుమంతరాయప్ప, కలేం, యూత్ కాంగ్రెస్ అంజి, ఫిరోజ్, జియా, షఫీ తదితరులు పాల్గొన్నారు.

బీసీలపై దాడులకు దిగితే సహించం

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

అగ్రవర్ణాల ఆధిపత్య పోరులో బీసీలను సమిధలుగా చేస్తున్నారని, బీసీలపై దాడులు జరిగితే సహించేది లేదని రాయలసీమ బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు కొట్టాల శ్రీరాములు హెచ్చరించారు. గురువారం పుట్టపర్తి పట్టణంలోని సాయి ఆరామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బీసీలపై దాడులు పెరిగాయన్నారు. ఇటీవల కర్నూలులో ఇద్దరు బీసీలు, పుంగనూరులో ఒక బీసీ వ్యక్తి బలయ్యారని విమర్శించారు. ఆ సంఘటన మరువకముందే రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో రెడ్డి, కమ్మల ఆధిపత్య పోరులో కురుబ లింగమయ్యను రాళ్లతో దాడి చేసి పాశవికంగా చంపారని ఆరోపించారు. జిల్లాలో వున్న బీసీ వెనుకబడిన సంక్షేమ, జౌళి శాఖ మంత్రి సవిత ఈ దాడిపై స్పందించాలన్నారు. కూటమి ప్రభుత్వం బీసీ వర్గాల ఓట్లతోనే అధికారంలోకి వచ్చామన్న సంగతి గుర్తుంచుకోవాలన్నారు. బీసీలను విస్మరిస్తే జగన్ ప్రభుత్వానికి పట్టిన గతే.., రాబోయే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి కూడా పడుతుందని హెచ్చరించారు. లింగమయ్య కుటుంబానికి ప్రభుత్వం నష్టపరిహారం రూ.25 లక్షలు అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీసీ నాయకులు ఎల్ఐసి వెంకటరాముడు, ఆదినారాయణ, తిరుపతేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అందరికీ ఉపాధి పనులు

ప్రజాశక్తి-సోమందేపల్లి

అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పిస్తామని ఎంపిడిఒ నరేంద్ర తెలిపారు. గుడిపల్లి పంచాయతీ వెలగ మాకులపల్లి గ్రామస్తులు ఉపాధి హామీ పని కల్పించలేదని ఫిర్యాదు చేసిన నేపథ్యంలో గురువారం ఎంపీడీవో నరేంద్ర అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అనంతరం క్షేత్ర సహాయకుని తో కలసి ఇంటింటా సర్వే నిర్వహించి ఉపాధి పనికి వెళ్లడానికి సిద్ధంగా ఉన్న కూలీలను గుర్తించి శ్రమశక్తి సంఘాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ప్రభుత్వం ప్రస్తుతం 307రూపాయలు దినసరి వేతనం పెంచిందని చెప్పారు. గ్రామంలో ఎవరూ కూడా వలస వెళ్లకూడదని ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో సోమశేఖర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చలో విజయవాడకు అనుమతి ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం మున్సిపల్ కార్మికుల చలో విజయవాడ కార్యక్రమానికి అనుమతి ఇవ్వాలని సిఐటియు నాయకులు కోరారు. ఈ మేరకు సిఐటియు మండల కన్వీనర్ జే వి రమణ, కో కన్వీనర్ టి.అయుబ్ ఖాన్ , కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఏం. బాబు, ముకుంద, లక్ష్మి ఓబులేసు తదితరులు వారు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ కలసి విన్నవించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు ఆప్కాస్ పద్ధతిని రద్దు చేసి కాంట్రాక్టు విధానం అమలు చేయాలనే ఆలోచనలను విరమించుకోవాలని, అలాకాని పక్షంలో కార్మికులకు రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్ పద్ధతిని రద్దుచేసి కాంట్రాక్ట్ విధానాన్ని అమలు చేస్తామని చెప్పడం కార్మికులకు మరింత నష్టం కలిగించే విధంగా ఉందని ఇటువంటి దుర్మార్గపు కాంట్రాక్టు విధానాల్ని.వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కార్మికులు రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మాత్యులకు వినతి పత్రం ఇవ్వడంకోసం విజయవాడకు వెళుతున్నారని అందులో భాగంగా ధర్మవరం కార్మికులు వెళ్లడానికి అనుమతి ఇవ్వాలని కమిషనర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో చెన్నకేశవులు, ప్రసాద్ ,ఓబులప్ప, తదితరులు పాల్గొన్నారు.


అధికారితో మాట్లాడుతున్న నాయకులు

సిఐజి మిషన్ చర్చి నిర్వాహకులకు నోటీసులు

ప్రజాశక్తి-పెనుకొండ

ప్రభుత్వ భూమిని ఆక్రమించారని తక్షణం వాటిని తొలగించి ప్రభుత్వానికి స్వాధీనం చేయాలని సిఐజి మిషన్ చర్చ్ నిర్వాహకులకు రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ శ్రీధర్, ఆర్ఐ భాస్కర్ రెడ్డిల మాట్లాడుతూ పట్టణంలోని సర్వేనెంబర్ 194-1లో 0.11 సెంట్లు ప్రభుత్వ భూమి ఉందన్నారు. ఈ భూమి చుట్టూ ఫ్రీ క్యాస్ట్ కాంపౌండ్ నిర్మాణం చేసి అందులో రేకుల షెడ్డును వేశారని తెలిపారు. ప్రభుత్వ భూమి దురాక్రమణ చేయడం చట్టరీత్యా నేరమని వారం రోజుల లోపు సమాధానం ఇవ్వాలని నోటీసులు జారీ చేశామన్నారు. సిఐజి మిషన్ చర్చి నిర్వాహకులు అందుబాటులో లేమని తెలపడంతో నోటీసులను సంబంధిత సచివాలయం వద్ద అంటించామని చెప్పారు. ప్రభుత్వ భూములను దురాక్రమణ చేస్తే కఠిన చర్యలు తప్పవని వారు హెచ్చరించారు.


ఆక్రమణకు గురైన స్థలం

కనుమరుగువుతున్న కుంతీ తీర్థం

పాలబావికి రక్షణ కరువు

ప్రజాశక్తి - కదిరి అర్బన్

ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ అధికారుల నిర్లక్ష్యం కారణంగా స్వామి వారి కుంతీతీర్థం కనుమ కనుమరుగవుతోందనిభక్తులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు ఇప్పటికైనా నరసింహస్వామి పవిత్రమైన కుంతి తీర్థాలను కాపాడి అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారికి ప్రతి ఏటా తుమ్మల రోడ్డులో ఉన్న చింతపూల ఉట్టి ఆస్థాన మండపం లో శ్రీ వారు శ్రీదేవి భూదేవి సమేతంగా భక్తుల దర్శనార్థం చింత పూల ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ చింతపూల ఉత్సవం కోసం ప్రధాన ఆలయం నుండి తుమ్మల రోడ్డు నందు ఉన్న కుంతీ తీర్థం వద్ద ప్రత్యేకంగా అలకరించిన పల్లకిలో చింతపూల మండపంవద్దకు ఊరేగింపుగా వెళ్ళడం జరుగుతుంది. చింతపూల మండపంలో శ్రీ స్వామి వారి ఆస్థాన పూజలు నిత్య కైంకర్యము నిర్వహించి అనంతరం శ్రీ స్వామి వారు తిరువీధుల ఉత్సవ కార్యక్రమం నిర్వహిస్తారు. చింతపూల మండపం ప్రక్కనే ఉన్న కుంతీతీర్థం ఆలయ అధికారుల నిర్లక్ష్యం కారణంగా కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది. ఈ విషయాన్ని, దేవాదాయ శాఖ అధికారులకు విన్నవించినా స్పందించలేదని జనసేన నాయకులు లక్ష్మణ్ తెలిపారు. ఆలయ అధికారులు భక్తులు ఇచ్చే విరాళాలపై ఉన్న శ్రద్ధ భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో లేకపోవడం బాధాకరమన్నారు. అదే విధంగా పాలబావికి రక్షణ గోడ నిర్మించాలని కోరుతున్నారు. ఇప్పటికైనా ఆలయ అధికారులు ఈ కుంతీతీర్థానికి పూర్వ వైభవం తీసుకురావలని కోరుతున్నారు. పాలబావికి ఒక రక్షణ గోడ లేదా కంచెను అయినా ఏర్పాటు చేసి, శ్రీ వారి పుష్కరిణీ కోనేరు అభివృద్ధి పరచాలని స్థానికులు కోరుతున్నారు.


ఆదరణకు నోచుకోని కుంతీ తీర్థం

జ్ఞాన సాయి విద్యార్థినికి రాష్ట్ర స్థాయిలో రెండవ ర్యాంకు

ప్రజాశక్తి - ఓబుల దేవర చెరువు

రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన స్కాలస్టిక్ అసెస్మెంట్ టెస్ట్ పరీక్ష లో స్థానిక శ్రీ జ్ఞాన సాయి విద్యా నికేతన్ స్కూల్ లో 7వ తరగతి చదువుతున్న విద్యార్థిని జి.శృతికీర్తన రాష్ట్ర స్థాయిలో రెండవ ర్యాంకు సాధించింది. ఈసందర్భంగా ప్రతిభా విద్యార్థినిని పాఠశాల ప్రిన్సిపల్ కనేకంటి క్రిష్ణమోహన్ రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ మేరకు ఈనెల 13వ తేదీన గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర జ్ఞాన మందిరం లో జరిగే అభినందన సభలో ఈ విద్యార్థినిని రూ. 7 వేలు పారితోషికంతో పాటు మెరిట్ సర్టిఫికెట్, మెమెంటో, మెడల్‌తో సత్కరిస్తారని వారు చెప్పారు.

పొలాల్లోకి దారి వదలాలని రైతుల నిరసన


రైతులతో మాట్లాడుతున్న పోలీసులు

ప్రజాశక్తి - చిలమత్తూరు

పొలాల్లోకి దారిని వదలాలని మండలంలోని తిమ్మాడిపల్లి రైతులు, గ్రామస్తులు గ్రీన్ ఫీల్డ్ హైవే ఎన్‌ఎచ్ 544జి రోడ్డు వద్ద మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఫిరంగి ప్రవీణ్ కుమార్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పెద్దనపల్లి నుండి విజయవాడ వెళ్లే గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు పనుల నిమిత్తం రైతుల పొలాల్లోకి పోతున్న దారిని వేరే చోటుకు మళ్లించకుండా అదే రోడ్డునే వెంటనే ఏర్పాటు చేయలన్నారు. గ్రామస్తులంతా వ్యవసాయం మీద ఆధారపడి జీవనం చేస్తున్నామని చెప్పారు. తమ పొలాలన్నీ హైవే వైపు ఉండడంతో రావడానికి పోవడానికి ఇబ్బంది అవుతుందని అన్నారు. బ్రిడ్జి, సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. రైతులకు ఇబ్బంది కలిగించకుండా రైతుల పొలాల్లోకి వెళ్లి రావడానికి దారిని చూపించాలి కోరారు. సమస్య పరిష్కరించుకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న సిఐ జనార్ధన్, ఎస్ఐ మునీర్ అహ్మద్ ఘటనాస్థలాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపి రోడ్డు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన నిర్మించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ జగన్నాథ్ కాంట్రాక్టర్ అనిల్ కుమార్, ఎస్ఐ మునీర్ అహ్మద్ కు తిమ్మాడపల్లి గ్రామ రైతులు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వినతి పత్రం అందించారు.

శాంతియుతంగా నవమి వేడుకలు

ప్రజాశక్తి-హిందూపురం

ఈ నెల 6వ తేది ఆదివారం జరిగే శ్రీరామ నవమి వేడుకలను అందరం కలిసి శాంతి యుతంగా జరుపుకుందామని మున్సిపల్ చైర్మేన్ రమేష్ కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని తహశీల్దార్ కార్యలయంలో తహశీల్దార్ వెంకటేశు అధ్యక్షతన శాంతి సంఘ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మున్సిపల్ చైర్మన్‌తో పాటు మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఎంతో ప్రతిష్టాత్మకమైన సుగూరు ఆంజినేయ స్వామి ఆలయంలో నవమి వేడుకలు ఘనంగా జరుగుతాయన్నారు. ఇందులో భాగంగా జరిగే శ్రీ రాముని కళ్యాణోత్సవం, లంకాదహనంతో పాటు ఇతర కార్యక్రమాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ మైనుద్దీన్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

కూరగాయల సంత వేలం

ప్రజాశక్తి - గోరంట్ల

గోరంట్ల గ్రామపంచాయతీ పరిధిలో కూరగాయల మార్కెట్ 2025 26 సంవత్సరానికి సంబంధించి గ్రామ సచివాలయంలో సర్పంచి సరోజ, గ్రామ కార్యదర్శి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో గురువారం వేలంపాట నిర్వహించారు ఈ వేలం పాటలో గోరంట్లకి చెందిన వృషభ దేవుడు 23 లక్షల ఇరవై రెండు వేల రూపాయలకు దక్కించుకున్నాడు. బస్టాండ్ నందు స్టాండ్ ఫీజు వేలంపాట వాయిదా పడింది. జెఆర్‌వై రూములు అద్దెకి ఇవ్వడానికి వేలం నిర్వహించగా వేలంపాట దారుల మధ్య పోటీ పెరిగి వాగ్వాదం చోటుచేసుకుంది వెంటనే పోలీసులు అక్కడికి చేరుకొని ఘర్షణ జరక్కుండా అదుపు చేశారు

నేత్రదానం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

చెన్నేకొత్తపల్లి మండలం నామాల గ్రామానికి చెందిన పాపన్న గురువారం మృతిచెందాడు. నేత్ర దానం గురించి విశ్వదీప సేవా సంఘం సభ్యులు మృతుని కుటుంబసభ్యులకు అవగాహన కల్పించారు. మృతుని కుటుంబ సభ్యుల సహకారంతో విశ్వ దీప సేవా సంఘం ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కుళ్లాయప్ప, కంటి రెట్రావైల్ సెంటర్ టెక్నీషియన్ రాఘవేంద్ర, భాస్కర్ తదితరులు మృతుని నేత్రాలను సేకరించారు. నేత్రదానానికి సహకరించిన మృతుని కూతురు గవ్వల దివ్య, అల్లుడు నవిన్, మనుమరాల్లు గవ్వలభావన, గవ్వల తన్వి, గవ్వల జయనికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఎంజెపి విద్యార్థుల ప్రతిభ

చిలమత్తూరు : జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా స్థాయిలో నిర్వహించిన ఆన్‌లైన్ పోటీలలో టేకులేడు గురుకుల బాలికల పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. సైన్స్ అండ్ టెక్నాలజీ పోటీలలో రక్షిత, జ్యోష్ణ, ప్రశాంతి మొదటి బహుమతి గెలుచుకున్నారు. మూఢనమ్మకాలు, శాస్త్రీయ విజ్ఞానం విభాగంలో వైష్ణవి, జోషిత, హాసిని జిల్లాస్థాయి మొదటి బహుమతిని గెలుచుకొని ప్రతిభ ను కనబరిచారు. ఈ కార్యక్రమంలోప్రిన్సిపల్ శోభారాణి, సైన్స్ ఉపాధ్యాయినులు నీరజ, అరుణ, లావణ్య, రామ తులసి, షేక్ బీబి విద్యార్థినులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జెవివి మండల అధ్యక్షులు అలీముల్లా, సురేష్ కుమార్ పాల్గొన్నారు.

శక్తి యాప్ ఉన్న ప్రతి ఒక్కరూ పోలీసులే

ప్రజాశక్తి-హిందూపురం

సెల్ ఫోన్ లో శక్తి యాప్ ఉన్న ప్రతి ఒక్కరూ పోలీసులేనని డిఎస్పి మహేష్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని వన్ టౌన్ స్టేషన్ లో మహిళా పోలీసులకు శక్తి యాప్ పై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం మహిళల భద్రత, రక్షణ కోసం అందుబాటులోకి తీసుకొచ్చిన శక్తి యాప్ పై మహిళా పోలీసులు విస్తృతస్థాయిలో ప్రచారం నిర్వహించడంతో పాటు ప్రతి ఒక్కరి సెల్ ఫోన్ లో ఈ యాప్ డౌన్లోడ్ చేసుకుని ఇన్స్టాల్ చేసుకునే విధంగా చూడాలన్నారు. ముఖ్యంగా విద్యాసంస్థలను సందర్శించి విద్యార్థినులకు యాప్ గురించి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐలు రాజగోపాల్ నాయుడు, అబ్దుల్ కరీం, ఆంజనేయులు, ఎస్ఐ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

ధర్మవరం రూరల్ : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని టూటౌన్ సిఐ రెడ్డప్ప హెచ్చరించారు. ఈ మేరకు ఆయన గురువారం తన సిబ్బందితో కలసి పట్టణంలోని వైయస్సార్ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, కేతిరెడ్డి కాలనీ, ఎల్-1, ఎల్-2, ఎల్ -3, ఎల్ -4 కాలనీలలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీలో ఉండే రౌడీషీటర్లకు అనుమానితులకు హెచ్చరికలు జారీ చేశారు. కాలనీలో ప్రజలంతా చట్టపరంగా జీవించాలని, కొత్త వ్యక్తులు ఎవరైనా సంచరిస్తే పోలీసులకి సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టూ టౌన్ సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు పాలు, బ్రెడ్లు పంపిణీ

ధర్మవరం రూరల్ : ధర్మవరం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం 150 మంది రోగులకు ఉదయం పాలు, బ్రెడ్, బిస్కెట్లను నర్సులు, డాక్టర్ల చేతులు మీదుగా అందజేశారు. శ్రీ సత్య సాయి సేవ సమితి -2, సుబ్బదాసు భజన మందిరం నిర్వాహకులు మాట్లాడుతూ దాతల సహాయ సహకారములతోనే ఇటువంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి, సుబ్బదాసు భజన మందిరం సాయి సేవ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్వాడీ చిన్నారులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - పరిగి

మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఉన్న అంగన్వాడి కేంద్రంలోనిచిన్నారులకు దివ్య ఎడ్యుకేషన్ ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు పరిగి వేణుగోపాలరావు ఆధ్వర్యంలో బట్టలను పంపిణీ చేశారు. తన కుమార్తె దివ్య జ్ఞాపకార్థం ప్రతి ఏడాది అంగన్వాడి కేంద్రాలలో చిన్నారులకు బట్టలు పంపిణీ చేస్తున్నారు. ఈసందర్భంగా ఆయన ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో నిరుపేద విద్యార్థులకు విద్యకు కావలసిన విద్యా సామాగ్రితో పాటు, వారి ఫీజుల విషయంలో కూడా ఆర్థిక సహాయం చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో గత ఆరేళ్లుగా వైద్య సదుపాయం కోసం వచ్చే గర్భిణులకు నాణ్యమైన భోజనాన్ని ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఈ సేవలను ట్రస్ట్ ద్వారా మరింత ముందుకు తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.


చిన్నారులకు బట్టలు పంపిణీ చేస్తున్న దృశ్యం

మీనుకు పిహెచ్‌డి

ప్రజాశక్తి - పావగడ

పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కామర్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న ఎం.మీనుకు పిహెచ్‌డి ప్రదానం చేశారు. బెంగుళూరులోని సెయింట్ జోసెఫ్ కళాశాల వాణిజ్య విభాగం ప్రొఫెసర్. డి రాజా జీబా బాసింగ్ ఆధ్వర్యంలో సమర్పించిన ధర ఆవిష్కరణ మరియు ప్రమాదంపై అధ్యయనం భారతీయ వ్యవసాయంలో నిర్వహణ కమోడిటీ మార్కెట్ -విత్ స్పెషల్ రిఫరెన్స్ టు సెలెక్టెడ్ సాఫ్ట్ కమోడిటీస్‌కు గాను డాక్టరేట్ ప్రదానం చేశారు.

ఛత్రపతి శివాజీ వర్ధంతి

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి రూరల్ లోని ఎర్రదొడ్డి సమీపంలో ఉన్న హరీష్ పాఠశాలలో గురువారం ఛత్రపతి శివాజీ మహారాజ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎం.ఎస్. కిరణ్ ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలువేసి ఘన నివాళు లర్పించారు. అనంతరం విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేసి ఆయన జీవిత చరిత్ర గురించి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి

ప్రజాశక్తి - తలుపుల

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని వ్యాధులకు దూరంగా ఉండాలనిఆరోగ్య వైద్యాధికారి అశ్రిత పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా ఉన్నటువంటి క్షయ వ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులను ఈరోజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పిలిపించి, వారికి కదిరి టీబీ యూనిట్ సూపర్వైజర్ శ్రీనివాసులు టీకా వేశారు.

హైవే పనుల పరిశీలన

ప్రజాశక్తి - మడకశిర

కొడికొండ నుండి అగళి మీదుగా శిర హైవే నిర్మాణ పనులను గురువారం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి గురువారం పరిశీలించారు. కోడికొండ నుండి కర్నాటక ప్రాంతం సిరాకు జరుగుతున్న హైవే పనులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రొళ్ల మండల కన్వీనర్ దాసిరెడ్డి, అగళి జడ్పిటిసి ఉమేష్, మండల ప్రధాన కార్యదర్శి జికె ఈరన్న, క్లస్టర్ ఇన్‌చార్జ్ భరత్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - నల్లచెరువు

స్థానిక గ్రామ సచివాలయం 1 దగ్గర ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీడీవో రఘునాథ గుప్తా పంచాయతీ సెక్రెటరీ నరేష్ నల్లచెరువు పంచాయతీ సర్పంచ్ పంచరత్నమ్మ గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

5న ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-హిందూపురం

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 5న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు రెడ్డి, శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని బాలాజీ థియేటర్ రోడ్డులో ఉన్న రోటరీ క్లబ్ హాలులో ఉదయం 9 నుండి ఒంటిగంట వరకు ఈ వైద్య శిబిరం జరుగుతుందన్నారు. పరీక్షలు అనంతరం అవసరమైన బాధితులకు కడప పుష్పగిరి కంటి ఆసుపత్రి లో ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

మహారాజశ్రీ అనంతపురం జిల్లా ప్రధాన న్యాయమూర్తి వారి కోర్టులో
I.A. No: 1413/2024 in O.S. No: 95/2024

Between:
గురప్ప గారి పెద్దన్న ...వాది
యెదిరి
టి.మంజునాథ్ ...ప్రతివాది

ప్రతివాదికి నోటీసు

To,
టి.మంజునాథ్ S/o లేట్ టి.గంగాదరప్ప, ప్లాట్ల వ్యాపారం, D.No:3/217, బి.సి.కాలనీ, చిలమత్తూరు గ్రామం & (మండలం), శ్రీ సత్యసాయి (జిల్లా)

అయిన మీకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయడం ఏమనగా పై కేసులోని వాది మీపైన బాకీ వసూలు కొరకు కేసు వేసినాడు. మీ ఆస్తి చిలమత్తూరు గ్రామ పొలం **Sy.No.**514-1 **A.C.**4-64 పైకి **A.C.**2-32 Cents, భూమిలో 1/5 వంతు భాగంపై జప్తు ఉత్తర్వులు పొంది వున్నారు. పై **I.A. No: 1413/2024 in O.S. No: 95/2024** పిటిషను ప్రధాన కేసుతో పాటు తేది:17/04/2025నా మీ హాజరు నిమిత్తం వాయిదా ఉన్నది. కావున ఆ రోజు ఉదయం 10:00 గంటలకు మీరు స్వయంగా కానీ లేదా మీ వకీలు ద్వారా కాని పై కోర్టు వారి ఎదుట హాజరై ఏమైనా ఆక్షేపణలు ఉన్న తెలియజేసుకోవలెను. అట్లు కాని యెడల కోర్టువారు పై కేసును మీ పరోక్షమున తీర్మాణించెదరు.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
బి.కుళ్ళాయప్ప
వాదితరుపు వకీలు, అనంతపురం.
సెల్ నెం:9966084311

మహారాజశ్రీ అనంతపురం జిల్లా ప్రధాన న్యాయమూర్తి వారి కోర్టులో
O.S. No: 95/2024

Between:
గురప్ప గారి పెద్దన్న ...వాది
యెదిరి
టి.మంజునాథ్ ...ప్రతివాది

ప్రతివాదికి నోటీసు

To,
టి.మంజునాథ్ S/o లేట్ టి.గంగాదరప్ప, ప్లాట్ల వ్యాపారం, D.No:3/217, బి.సి.కాలనీ, చిలమత్తూరు గ్రామం & (మండలం), శ్రీ సత్యసాయి (జిల్లా)

అయిన మీకు తెలియజేయడం ఏమనగా పై కేసులోని వాది మీపైన తమకు రావలసిన బాకీ వసూలు కొరకు కేసు మీపై వేసినాడు. పై కేసు మీ హాజరు నిమిత్తం కోర్టు వారు తేది:17/04/2025నా వాయిదా వేసినారు. కావున ఆ రోజు ఉదయం 10:00 గంటలకు మీరు స్వయంగా కానీ లేదా మీ వకీలు ద్వారా కాని హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకోవలెను.అట్లు కాని యెడల కోర్టువారు మీకు ఎలాంటి ఆక్షేపణలు లేవని గ్రహించి మీ పరోక్షమున కేసు తీర్మానం చేయుదురు.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
బి.కుళ్ళాయప్ప
వాదితరుపు వకీలు, అనంతపురం.
సెల్ నెం:9966084311

నేరాలు ఘోరాలు

గంజాయి విక్రేతల ముఠా అరెస్టు

ప్రజాశక్తి-హిందూపురం

ఇతర ప్రాంతం నుండి గంజాయి తీసుకువచ్చి హిందూపురంలో విక్రయించే ఐదుగురిని అరెస్టు చేసి వారి నుండి 600 గ్రాముల గంజాయి, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు హిందూపురం డిఎస్పి కెవి మహేష్ తెలిపారు. గంజాయి సరఫరా చేసే పెనుకొండకు చెందిన సయ్యద్ బాబా ఫక్రుద్దీన్ తో పాటు స్థానికంగా విక్రయించే హిందూపురానికి చెందిన జాహిద్ అహ్మద్, షేక్ తబ్రేజ్, సాయి వినయ్, ఇమ్రాన్ లను అరెస్టు చేసి వారి నుండి రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఎవరైనా గంజాయి కొనుగోలు చేసినా, విక్రయించినా, గంజాయి కార్యకలాపాల్లో పాల్గొన్నా కఠిన చర్యలు తీసుకుంటామనిహెచ్చరించారు. ఈ సమావేశంలో సిఐలు సిఐలు రాజగోపాల్ నాయుడు, అబ్దుల్ కరీం, ఆంజనేయులు, ఎస్ఐ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.


నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

ఇసుక దిబ్బలు విరిగిపడి యువకుడు మృతి

ప్రజాశక్తి - పరిగి

ఇసుక దిబ్బలు మీద పడి యువకుడు మతి చెందిన సంఘటన మండలంలోని పెద్దిరెడ్డిపల్లిలో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన యువకుడు హేమంత్ (28) ఇంటి నిర్మాణం కోసం తన ట్రాక్టర్ ద్వారా ఇసుకను జయ మంగలి నది ద్వారా తీసుకురావడానికి కూలీలతో పాటు వెళ్లాడు. అక్కడ ఇసుక తోడుతుండగా ప్రమాదవశాత్తు మట్టి దెబ్బలు అతనిమీద పడ్డాయి. మట్టిదిబ్బలను బయటకు తీసేసరికి హేమంత్ మృతిచెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పేకాట జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణంలోని గాంధీనగర్ రైల్వే కింద వంతెన సమీపంలో బుధవారం రాత్రి జూదమాడుతున్న ఆరుగురుని అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు వన్‌టౌన్ సిఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.5,240 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

మద్యం రవాణా దారుడు...

ప్రజాశక్తి-హిందూపురం

మద్యం రవాణా దారుడిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సిఐ లక్ష్మీ దుర్గయ్య తెలిపారు. హిందూపురం నుండి తూముకుంట కు వెళ్ళే రహదారిలో సూగూరు గేట్ వద్ద అక్రమంగా మద్యం రవాణా చేస్తున్న హిందూపురం పట్టణంలోని అంబేద్కర్ నగర్ కు చెందిన ప్రసాద్ వర్మను అరెస్టు చేశామన్నారు. ఈ తనిఖీల్లో సీఐ సునంద, ఎస్‌ఐలు సత్యనారాయణ, పృథ్వీరాజ్, ఫరూక్, కానిస్టేబుళ్లు నరసింహ, వెంకటేష్, అంజి, శివ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం పట్టణంలోని బెస్తవీధిలో గల 19 సంవత్సరాల విద్యార్థిని బెస్త జాహ్నవి ఈనెల రెండవ తేదీ ఉదయం 10 గంటల నుంచి కనపడటంలేదని విద్యార్థిని కుటుంబసభ్యులు ఫిర్యాదు చేసినట్లు వన్ టౌన్ సిఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. అమ్మాయి ఆచూకీ తెలిసినవారు వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో సమాచారాన్ని అందించాలని ఆయన కోరారు.

యోగివేమన ఆలయాన్ని సందర్శించిన డీఎస్పీ

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండల పరిధిలోని కటారుపల్లి పంచాయతీలోని శ్రీ యోగి వేమన ఆలయాన్ని కదిరి డిఎస్పి శివ నారాయణస్వామి గురువారం సందర్శించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6, 7 తేదీలలో నిర్వహించే శ్రీ యోగి వేమన బ్రహ్మోత్సవాల సందర్భంగా తగిన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎలాంటి సమస్యలు లేకుండా ప్రశాంతంగా బ్రహ్మోత్సవాలు జరిగే విధంగా చూడాలని రూరల్ సిఐ నాగేంద్రకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి నంద వేమారెడ్డి, ఎస్ఐ వలిబాషా, జమేదార్ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

బోరుబావి తవ్వకం

పరిగి : వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తుగా పరిగి మండల వ్యాప్తంగా 8 బోరుబావుల తవ్వకానికి మంత్రి సవితమ్మ ఆదేశాలు ఇచ్చింది. పరిగి మండలంలోని కొడిగెనహళ్లి పంచాయతీ వ్యాప్తంగా3,మోద పంచాయతీలో 2 బోరు బావుల తవ్వకాలు నిర్వహిస్తుండగా తిరమలనగర్ లో వేస్తున్న బోరుబావి తవ్వకాన్ని ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్ ప్రత్యూషతో పాటు ఎంపీడీవో శ్రీధర్ పర్యవేక్షించారు. జల జీవన్ మిషన్ నిధుల ద్వారా బోరు తవ్వకాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. మండల కన్వీనర్ గోవిందరెడ్డి ఆధ్వర్యంలో బోరు తవ్వకానికి పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కో కన్వీనర్ రెడ్డివారి మంజునాథ్, సోమప్ప వెంకటేష్, గోపాల్, నాగభూషణం మహేష్ విట్టపల్లి నాగరాజు, డీఎస్ఎల్ శ్రీనివాసులు,వడ్డెర శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఆర్టీసీ ఎన్ఎంయు ఉద్యోగులు చేస్తున్న నిరసనలు రెండోరోజైన గురువారం కొనసాగాయి.ఈసందర్భంగా ఉద్యోగులు ఎర్రబార్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం స్పందించి ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు నిరసన తెలుపుతున్నామన్నారు. రెండుసార్లు ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్‌కు తమ సమస్యలపై వినతిపత్రం ఇస్తే ఇంతవరకు పట్టించుకోలేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం తమ డిమాండ్లపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో యూనియన్ రీజినల్ అధ్యక్షులు శ్రీరామ్ నాయక్, జిల్లా కార్యదర్శి షబ్బీర్, డిపో అధ్యక్షులు శివశంకర్, డిపో ప్రధాన సలహాదారు అప్పిరెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయ సహకార సంఘం ఎన్నికలు

పావగడ : తాలూకాలోని తిరుమణి వ్యవసాయ సేవా సహకార సంఘానికి జరిగిన ఎన్నికలలో అధ్యక్షుడుగా పి. వరద రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎస్. ఆదినారాయణ ఎకగ్రీవంగా ఎన్నికయ్యారు. మొత్తం 12 మంది సభ్యులున్న ఈ సహకార సంఘములో అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు నామినేషన్లు వేయకపోవడంతో అధ్యక్ష ఉపాధ్యక్ష పదవిలో ఏకగ్రీవం అయినట్లు ఎన్నికల అధికారి సిడిఒ సి వెంకటేష్ తెలిపారు. గెలుపొందిన అధ్యక్ష ఉపాధ్యక్షులకుకాంగ్రెస్ నాయకులు లక్ష్మీనారాయణ రామచంద్ర రెడ్డి చలపతి అన్నదానపుర నాగరాజు తిరుమణి గ్రామపంచాయతీ అధ్యక్షుడు తిరుపతయ్య ఉపాధ్యక్షుడు మురళి ఎన్ శివశంకర్ పూలమాలలు వేసి సన్మానించి అభినందనలు తెలిపారు.

ఎన్ఎంఎంఎస్ కు ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మండల పరిధిలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు జాతీయ ఉపకార వేతనాలు(నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్షిప్)కు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ రమేష్ బాబు తెలిపారు. 8వ తరగతి చదువుతున్న తన్మయి శ్రీ, పూజ ఎంపికయ్యారని చెప్పారు. ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన వీరికి ప్రతి సంవత్సరం 12 వేల రూపాయలు ప్రభుత్వం బ్యాంక్ ఖాతాలలో జమ చేయనున్నట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపల్ పాఠశాల అధ్యాపకులు అభినందించారు.